క్లుప్తంగా

నేడు గుండె వైద్య శిబరం

ఉండ్రాజవరం: దమ్మెన్ను గ్రామంలో ప్రాథమిక పాఠశాల వద్ద ఆదివారం ఉచిత గుండె వైద్య శిబరం నిర్వహిస్తున్నట్టు సర్పంచ్ గుర్లజర్ల సత్యనారాయణ శనివారం తెలిపారు. ఈ శిబరంలో విజయవాడ డాక్టర్ వై.వి.రావు ఉషా కార్డియాక్ సెంటర్ వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. గ్యాస్ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నవారికి టూ.డి.ఎకో, గుండె స్కానింగ్ పరీక్షలు, ఈసీజీ పరీక్షలు ఉచితంగా చేస్తారన్నారు. గుండె సంబంధిత సమస్యలు ఉన్నవారు ఈశిబరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వనిత క్లబ్ సేవలు అభినందనీయం



కట్టు మెషీన్లు పంపిణీ చేస్తున్న వాసవీ వనిత క్లబ్ సభ్యులు

నిడదవోలు: వాసవీ వనిత క్లబ్ సేవలు అభినందనీయమని వాసవీ గవర్నర్ కృష్ణాజీ అన్నారు. పట్టణంలో వాసవీవనిత క్లబ్ ఆధ్వర్యంలో శనివారం పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. అమ్మకు గౌరవం కార్యక్రమంలో భాగంగా స్థానిక రైల్వేస్టేషన్‌లో క్యాబిన్ (చంటి పిల్లలకు తల్లి పాలిచ్చు గది)ని గవర్నర్ ప్రారంభించారు. పట్టణంలో మదనగోపాలస్వామి వారి ఆలయానికి నాలుగు కుర్చీలు అందించారు. ఎల్‌బీహెచ్ మున్సిపల్ ఎలిమెంటరి పాఠశాలలో నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. పేదలకు రెండు కుట్టు మెషీన్లు అందజేశారు. కార్యక్రమంలో మానేపల్లి వెంకటరమణ, జయవరపు లక్ష్మి, వాసవీ వనితా క్లబ్ అధ్యక్షురాలు దివ్వెల పణిమాధురి, కార్యదర్శి గొల్లపూడి, గాయత్రి, కోశాధికారి జవ్వాది శిరీష, సింహాద్రి శిరీష, ఉదయగిరి మణి, కొత్త గీత, ఉద్దగిరి అమ్మాజీ, పెనుగొండ. రజని, పెనుగొండ సూర్యకళ, కేదారిశెట్టిపద్మిని తదితరులు పాల్గొన్నారు.

ఎంపీపీ ఉండవల్లికి మాతృవియోగం



నాగరత్నం భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే వెంకట్రావు

గోపాలపురం: స్థానిక ఎంపీపీ ఉండవల్లి సత్యనారాయణ తల్లి నాగరత్నం(83) అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. ఆమె భౌతికకాయాన్ని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు సందర్శించి నివాళులు అర్పించారు. జెడ్పీటీసీ సభ్యురాలు కాకులపాటి లలిత, సర్పంచ్ జొన్నకూడి మనెమ్మ, వైఎస్సార్ సీపీ నాయకులు కూసం రామమోహన్‌రెడ్డి, ఎస్‌కే వల్లీ, ముల్లంగి శ్రీనివాసరెడ్డి, మండలంలోని వివిధ గ్రామాల సర్పంచ్, ఎంపీటీసీలు, అధికారులు నివాళులు అర్పించిన వారిలో ఉన్నారు.

పశువులకు టీకాలు

చాగల్లు: మండలంలోని అన్ని గ్రామాల్లో జనవరి రెండో తేదీ నుంచి 31వ తేదీ వరకూ పశువులకు గాలి కుంటు వ్యాధి నివారణా టీకాలు వేయనున్నట్లు మండల పశు వైద్యాధికారి యు.ముకేష్ తెలిపారు. ఈ విషయాన్ని శనివారం ఆయన ఒక ప్రకటన తెలిపారు. మండలంలో 12వేలకు పైగా పశువులు ఉన్నాయన్నారు. వీటన్నింటికి టీకాలు వేస్తామన్నారు. గాలికుంటు వ్యాధి పశువుల్లో వైరస్ ద్వారా వ్యాప్తి చెందుతుందని, 4 నెలల వయస్సు దాటిన పశువులన్నింటికి టీకాలు వేయించాలన్నారు.

సారాతో వ్యక్తి అరెస్టు

దేవరపల్లి: స్థానిక ఎస్‌ఈబీ స్టేషన్ పరిధిలోని వేళ్ల చింతలగూడెంలో శనివారం దాడులు నిర్వహించినట్టు సీఐ డి.సుధ తెలిపారు. గ్రామంలో కుక్కల మోహనకృష్ణ వద్ద 12 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని అరెస్టు చేసినట్టు ఆమె తెలిపారు. అక్రమ సారా కేసులో దేవరపల్లి తహసీల్దార్ వద్ద బైండోవర్‌లో ఉన్న జి.సాయిబాబుకు రూ.15 వేలు జరిమానా విధించినట్టు ఆమె తెలిపారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు



క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు

నల్లజర్ల: శాంతి, త్యాగం, కరుణ, దయ, ప్రేమ, నిరీక్షణ సందేశంతో లోకానికి క్రీస్తు కొత్త మార్గాన్ని చూపారని క్రిస్టియన్ మైనార్టీ డెవలప్‌మెంట్ కౌన్సిల్ ఫౌండర్ పండుప్రేమ్‌కుమార్ అన్నారు. సుభద్రపాలెంలో శాలెం సహవాస ప్రార్ధన మందిరంలో శుక్రవారం రాత్రి బ్రదర్ కె.మాణిక్యం ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పండు ప్రేమ్‌కుమార్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుణ శామ్యూల్ మాట్లాడుతూ క్రీస్తూ మార్గం అనుసరణీయన్నారు. అనంతరం కె.మాణిక్యం దంపతులు సమకూర్చిన 80 రగ్గులను వృద్ధులకు, వికలాంగులకు, వితంతువులకు అందజేశారు. పెనుమాక రాజు విద్యార్థులకు స్టీల్ బాక్స్‌లు అందజేశారు. అనంతరం సండే స్కూల్ విద్యార్థులు నృత్యాలు, నాటికలు, గీతాలు ఆలపించారు. పాస్టర్ పలివెల జకర్యా, పాతకోకల పద్దయ్య, సంఘ పెద్దలు పెనుమాక వెంకట్రావు, శేఖర్, వెంకటేశ్వరావు, జీవన్, రాజేష్ పాల్గొన్నారు.

న్యూ ఇయర్ జోష్

- నూతన సంవత్సర వేడుకలకు సన్నాహాలు
- కిటకిటలాడుతున్న దుకాణాలు
- ఆఫర్లతో ఆకట్టుకుంటున్న వ్యాపారులు



నిడదవోలు పట్టణంలో దుకాణాల వద్ద సిద్ధంగా ఉన్న బొకేలు, పూలదండలు



నల్లజర్లలో అమ్మకానికి సిద్ధంగా ఉన్న పండ్లు



పట్టణంలో బ్యాకరీలలో సిద్ధంగా ఉన్న కేక్‌లు

నిడదవోలు/ చాగల్లు: కొత్త ఏడాదికి స్వాగత ఏర్పాట్లతో వాడవాడలా పండగ వాతావరణం నెలకొంది. ఇప్పటికే వాట్సప్, ఫేస్‌బుక్, ఎస్సెమ్మెస్‌ల ద్వారా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకోవడానికి వివిధ డిజైన్లను యువత రూపొందించే పనిలో నిమగ్నమయ్యారు. ఇంటి ముంగిళ్లలో నూతన సంవత్సర స్వాగత అక్షరాలు, రంగవల్లులు అందంగా తీర్చిదిద్దడానికి మహిళలు, యువతులు పోటీ పడుతున్నారు. కొవ్వూరు డివిజన్ పరిధిలో ప్రజలు కోటి ఆశలతో కొత్త ఏడాదిని స్వాగతించెందుకు సన్నద్ధమవుతున్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో భారీ టెంట్‌లతో ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. పట్టణంలో ఏ సెంటర్ చూసినా తమ స్తోమతను బట్టి ఫ్లెక్సీలను ఏర్పాటు చేసుకుంటున్నారు. నియోజగవర్గంలో వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, పార్టీ శ్రేణులు నూతన సంవత్సరం, సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేసే కటౌట్లను ఏర్పాటు చేశారు. పట్టణంతో పాటు గ్రామాల్లో వివిధ ప్రధాన సెంటర్‌లలో వివిధ సామాజిక యువజన సంఘాల ఆధ్వర్యంలో నూతన సంవత్స వేడుకలకు ఏర్పాట్లు ముమ్మరం చేస్తున్నారు. పట్టణంలో సుమారు 20 వరకూ బిర్యానీ సెంటర్లు ఉన్నాయి. వీటితో పాటు 31 రాత్రికి ప్రత్యేక దుకాణాల ద్వారా పలావ్, వివిధ రకాల వంటకాలు తయారు చేసి విక్రయించడానికి టెంట్లు సిద్ధం చేసుకుంటున్నారు. పలు హోటళ్ల ప్రత్యేక వంటకాలు, ఆఫర్లతో వినియోగదారులను ఆకర్షించేలా ప్రచారాలు చేస్తున్నారు. రెండు పలావ ప్యాకెట్లు కొంటే శీతల పానీయం ఉచితం అంటూ బెర్డులను కూడా ఏర్పాటు చేశబూరు.అన్ని దేవాలయాల్లో తమ ఇష్ట దైవాలను పూజించి నూతన ఏడాదిని ప్రారంభించనున్నారు. క్రైస్తవులు క్రీస్తు ప్రార్ధనా మందిరాలను విద్యుద్దీపాలతో అలంకరించారు. ప్రధానంగా కొత్త సంవత్సర కేక్‌లు ఆర్డర్లు భారీ ఎత్తున సాగుతున్నాయి. వివిధ బ్యాకరీల్లో కూల్ కేక్‌లు, సాధారణ కేక్‌లను ఇప్పటికే ఆర్డర్లు ఇస్తున్నారు. సాధారణ కేక్ కేజీ రూ.300 కూలింగ్ కేక్ కేజీ రూ.600 వ్యాపారులు విక్రయిస్తున్నారు. చాగల్లు మండలంలో న్యూయర్ వేడుకలకు చాగల్లు, ఊనగట్ల, బ్రాహ్మణగూడెం తదితర గ్రామాల్లో దుకాణదారులు, హోటళ్లు ఆపర్లను ప్రకటించాయి.

నల్లజర్ల: గ్రామాల్లో కొత్త సంవత్సరం సందడి మొదలైంది. న్యూఇయర్‌కి స్వాగతం పలికేందుకు సిద్ధమయ్యారు. చిన్నా పెద్దా అంతా కేరింతలు కొడుతున్నారు. మహిళలు ఇంటి ముందు రంగవల్లులు వేయనున్నారు. రాజకీయ నాయకులకు శుభాకాంక్షలు చెప్పేందుకు ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో మార్కెట్‌లో పూలు, పండ్లు, బొకేలు, కేకులకు డిమాండ్ పెరిగింది. బొకేలను వ్యాపారులు సిద్ధం చేస్తున్నారు. బేకరీల్లో కిలో కేక్ రూ.300 చి రూ.450 రకు ఉంది. కేల ధర కూడా బాగా పెరిగింది.

వాకిళ్లలో రంగవల్లులు..



మార్కెట్లో సిద్ధంగా ఉన్న రక రకాలు రంగులు

నూతన సంవత్సరాన్ని స్వాగతిస్తూ ఇళ్లరంగుల ముగ్గులతో అలరించేందుకు మహిళలు సన్నద్ధమవుతున్నారు. ఇందుకు అవసరమైన రంగులు మార్కెట్లో సిద్ధం చేశారు. ఆదివారం రాత్రి నుంచే రంగు రంగుల స్వాగత ముగ్గులు వేయడానికి మహిళలు సన్నద్ధమవుతున్నారు. నూతన సంవత్సర వేళ ప్రత్యేక ప్రార్థనలు చేసేందుకు చర్చిలను విద్యుత్ దీపాలతో అలంకరించారు.

మంత్రిని సత్కరించిన ఉద్యోగులు



మంత్రి వనితను సత్కరిస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు

కొవ్వూరు: తాడిపూడి ఎత్తిపోతల పథకం నిర్వహణలో పని చేస్తున్న 27 మంది అవుట్ సోర్సింగ్ సిబ్బందిని అబ్కాస్ (ఏపీసీవోఎస్) పరిధిలో చేర్చినందుకు వారు శనివారం రాష్ట్ర హోమ్ మంత్రి తానేటి వనితను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. పట్టణంలో మంత్రి క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం మంత్రి చేతుల మీదుగా కేక్ కట్ చేయించి స్వీట్లు పంచారు. ఈ సందర్భంగా మంత్రి వనితకి శాలువా కప్పి సత్కరించారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

ఏపీ ప్రధానోపాధ్యాయుల సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను రాష్ట్ర హోమ్ మంత్రి తానేటి వనిత శనివారం ఆవిష్కరించారు. పట్టణంలో యువరాజ్ పంక్షన్ హాలు నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర కోశాధి కారి పీవీవీ సత్యనారాయణ, రాష్ట్ర మహిళా కార్యదర్శి ఆర్.శైలజ, ఏలూరు జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు డీవీ రమణ, జి.ప్రకాశరావు, కోశాధికారి సురేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి మంగిన శ్రీరామారావు, రాష్ట్ర కౌన్సిలర్ టీఎస్ రామానుజం తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమమే లక్ష్యంగా జగనన్న పాలన



నడుపల్లిలో మహిళలకు పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు, పార్టీశ్రేణులు

- ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు
- నడుపల్లిలో గడప గడపకూ మన ప్రభుత్వం

పెరవలి: రాష్ట్రంలో అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. నడుపల్లి గ్రామంలో సర్పంచ్ బీరా సత్యవేణి, సొసైటీ అధ్యక్షుడు కరుటూరి భాస్కరరావు ఆధ్వర్యంలో రెండో రోజు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు ఇంటింటికీ వెళ్లి లబ్దిదారులకు అందిన సంక్షేమ పథకాలను వివరిస్తూ బుక్‌లెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు నామినేటెడ్ పోస్టుల్లో సముచిత స్థానం కల్పించామన్నారు. వెనుకబడిన కులాలలకు ఆత్మగౌరవాన్ని ఇచ్చిన జగనన్నకు మద్దతుగా ఉండాలని కోరారు. బాబుకే గ్యారెంటీ లేదని, ఆయన ఇంకేం రాష్ట్ర ప్రజలకు గ్యారెంటీ ఇస్తాడని ప్రశ్నించారు. ప్రజాసంకల్ప యాత్ర ద్వారా ప్రజల కష్టాలను దగ్గర నుంచి చూసిన జగనన్న నాలుగున్నరేళ్లలో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చారని తెలిపారు. నడుపల్లి గ్రామాన్ని రూ.24 కోట్లతో అభివృద్ధి చేశామన్నారు. అనంతరం గ్రామ సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్, జెడ్పీటీసీ సభ్యురాలు కొమ్మిశెట్టి రామాంజని, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు వీరమల్లు సత్యనారాయణ, పార్టీ ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు బీరా రాజు, నాయకులు వెంకటరమణ, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు



తూర్పుచోడవరంలో మహిళల కబడ్డీ పోటీలు

నల్లజర్ల: క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్తు అందించడమే లక్ష్యంగా ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీలను ప్రభుత్వం నిర్వహిస్తోందని తూర్పు, పడమరచోడవరం, గుండేపల్లి గ్రామాల కార్యదర్శి మహిళాదేవి అన్నారు. తూర్పుచోడవరం హైస్కూలులో శనివారం వాలీబాల్, ఖోఖో, కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువత చదువుతో పాటు క్రీడల్లోను రాణించాలన్నారు. గెలుపు ఓటములు సహజమని ఓటమికి కుంగిపోకుండా విజయమే లక్ష్యంగా ముందుకు కొనసాగాలన్నారు. తూర్పుచోడవరం కార్యదర్శి కోట శ్రీనివాస్, మండల క్రీడా కన్వీనర్ పల్లి వెంకట అప్పారావు పాల్గొన్నారు.

పాస్టర్ దంపతులకు దుస్తుల పంపిణీ

మంత్రి వనిత ఆధ్వర్యంలో గ్రాండ్ క్రిస్మస్ వేడుకలు



కొవ్వూరులో పాస్టర్ల దంపతులకు దుస్తులు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే బాబాజీరావు, మంత్రి వనిత

కొవ్వూరు: పట్టణంలో యువరాజ్ పంక్షన్ హాలులో శనివారం రాష్ట హోమ్ మంత్రి తానేటి వనిత ఆధ్వర్యంలో గ్రాండ్ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. తన తండ్రి, మాజీ ఎమ్మెల్యే జొన్నకూటి బాబాజీరావు పుట్టిన రోజు వేడుకల్లో భాగంగా నియోజకవర్గం పరిధిలోని 800 మంది పాస్టర్ దంపతులకు వస్త్రాలు బహుకరించారు. డాక్టర్ జొన్నకూటి ప్రమోద్‌కుమార్ రాసిన బాబాజీరావు జీవిత చరిత్ర రాగోలు పల్లి టూ రాజధాని పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఆయన అందించిన సేవలను వక్తలు కొనియాడారు. ప్రముఖ ప్రసంగీకులు జాన్ వెస్లీ, దైవజనులు డాక్టర్ ఏసు పాదం, మల్లిపూడి డేవిడ్ రాజు,బిషప్ కె.జోషఫ్, ఎస్.ఎడ్వర్డు, బ్యాంక్ ఆఫ్ ఇండియా డీజీఎం సాహు, పాధర్ డానియేలు, బాబాజీరావు కుమారుడు విజయ్‌కుమార్, కుమార్తెలు మంత్రి వనిత, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ జె.సునీత, ఇతర కుటుంబ సభ్యులు, పలువురు అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

అడుగడుగునా నిఘా..



ఎన్నికల పరికరాలను పరిశీలిస్తున్న కలెక్టర్ మాధవీలత

సీటీఆర్ఐ: రాజమహేంద్రవరం కేంద్రంగా నూతనంగా ఏర్పడిన తూర్పుగోదావరి జిల్లాలో తొలి ఎన్నికలకు సర్వం సిద్ధం చేశారు. బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీ పాట్ యూనిట్లను అత్యంత భద్రత నడుమ ఉంచారు. కేంద్ర ఎన్నికల షెడ్యూల్ ప్రకారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ మాధవీలత దగ్గర ఉండి పర్యవేక్షిస్తున్నారు. వివిధ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల అధికారులు, సిబ్బంది మధ్య వీటిని తనిఖీ చేయడం జరుగుతోంది. రాజమహేంద్రవరంలోని ఫుడ్ కార్పొరేషన్ ఇండియా (ఎఫ్‌సీఐ)లో ఎన్నికల పరికరాలను భద్రపరిచారు. వీటి తొలి దశ తనిఖీలు అత్యంత జాగ్రత్తతో, భారీ భద్రత మధ్య కట్టుదిట్టంగా నిర్వహించారు.

బెల్ ఇంజినీర్ల ఆధ్వర్యంలో..

జిల్లాకు కేటాయించిన ఎన్నికల యూనిట్లను బెంగళూర్ బెల్ సంస్థకు చెందిన సీనియర్ సాంకేతిక ఇంజినీర్ల ఆధ్వర్యంలో అత్యంత పకడ్బందీగా మొదటి దశ తనిఖీలు పూర్తి చేశారు. జిల్లాకు చెందిన 5,971 బ్యాలెట్ యూనిట్లు, 5,463 కంట్రోల్ యూనిట్లు, వీవీ పాట్ యూనిట్లు 4,927 లను ఇక్కడ భద్రపరిచారు.

తరచూ తనిఖీలు

జిల్లాకు కేటాయించిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను భద్రపరచిన గోడౌన్‌ను కేంద్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి తనిఖీ బుధవారం తనిఖీ చేశారు. పూర్తి భద్రత, 24 గంటల సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఈ గోడౌన్ పూర్తి రక్షణలో ఉంది. మూడు షిఫ్టులలో పోలీసులు భద్రత కల్పిస్తున్నారు.

వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడిగా కృపానందం

పార్టీ పట్టణ, మండల నూతన కమిటీల ఎంపిక



కృపానందం

నిడదవోలు: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి శనివారం పార్టీ పట్టణ, మండల, క్లస్టర్ నూతన కమిటీలను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వైఎస్సార్ సీపీ నిడదవోలు పట్టణ అధ్యక్షుడిగా ముంగంటి కృపానందం ఎంపికయ్యారు. ఉపాధ్యక్షులుగా షేక్ ఖాన్‌బాషా, మద్దకూరి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా గాజుల రంగారావుతో పాటు కార్యవర్గ సభ్యులను ఎంపిక చేశారు. అదేవిధంగా వైఎస్సార్ సీపీ నిడదవోలు మండల అధ్యక్షుడిగా అయినీడి పల్లారావు, ఉపాధ్యక్షులుగా ఆరేపల్లి చంటి, రాపాక వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా వెలగని పోలయ్య, ఉండ్రాజవరం మండల అధ్యక్షుడిగా నందిగం భాస్కర రామయ్య, ఉపాధ్యక్షులుగా నాగిరెడ్డి వెంకటేశ్వరరావు, పింద్ర పొచ్చేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా కటారి సిద్ధార్థరాజు, పెరవలి మండల అధ్యక్షుడిగా వీరమల్లు సత్యనారాయణ, ఉపాధ్యక్షులుగా సత్తి సూర్య వేమన భాస్కర్ రెడ్డి, కొమ్ము శెట్టి రామారావు, పార్టీ ప్రధాన కార్యదర్శిగా చర్ల శ్రీరామచంద్రరెడ్డిలతో పాటు కార్యవర్గ సభ్యులు ఎంపికయ్యారు.

భారతదేశంలోనే స్త్రీకి అత్యున్నత గౌరవం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): భారతదేశంలో స్త్రీకి అత్యున్నత గౌరవం లభించిందని, ఈ విషయాన్ని రామాయణ, భారతాలు చెబుతున్నాయని సమన్వయ సరస్వతి సామవేదం షణ్ముఖ శర్మ అన్నారు. శనివారం హిందు సమాజంలో ఆయన 18వ రోజు ప్రవచనాన్ని కొనసాగించారు. చిత్రకూట పర్వత ప్రాంతాన్ని విడిచి, దండకారణ్యానికి బయలు దేరిన సీతారామలక్ష్మణులు మార్గ మధ్యంలో అత్రి, అనసూయ దంపతులను సందర్శించారు. సీతాదేవి అనసూయతో వినయ పూర్వకంగా మాట్లాడుతూ భర్త ఎటువంటి వాడయినా, భార్య అతడిని సేవించాలని అంటుంది.అత్రి మహర్షి రాముని అనఘా అని సంబోధిస్తారు. ఈ పదానికి పాపరహితుడా అని ఒక అర్థం ఉంది, దత్తాత్రేయుని పేర్లలో ఇది ఒకటని ఆయన అన్నారు. లక్ష్మీఅష్టోత్తరంలో కూడా అనఘా అన్న పేరు కానవస్తుందన్నారు. మహర్షులతో సహవాసానికే రాముని వనవాసమని, రాముడు వెళ్లాల్సిన మార్గాన్ని అడుగడుగునా మహర్షులే సూచించడం మనం గమనించవచ్చని సామవేదం అన్నారు. కాగా.. శనివారం అయోధ్యాకాండ ప్రవచనం ముగించి, అరణ్యకాండలోకి ప్రవేశించారు.

గోవిందుడికి లక్షపత్రి పూజ

కొవ్వూరు: ధనుర్మాసం సందర్భంగా పట్టణంలో గోష్పాదక్షేత్రంలోని సుందర గోవిందుడి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. శనివారం స్వామివారికి లక్ష పత్రి పూజ చేశారు. అనంతరం స్వామివారిని విశేష అలంకరణ చేసి, భక్తులకు దర్శనం కల్పించారు.



పత్రి పూజ చేస్తున్న అర్చకులు

ముగిసిన కోటసత్తెమ్మ తిరునాళ్లు



అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు, సుమలత దంపతులు

- గరగలు ఎత్తుకున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు దంపతులు
- అలరించిన బాణసంచా వెలుగులు



ప్రత్యేక పుష్పాలంకరణలో దర్శనమిస్తున్న కోటసత్తెమ్మ అమ్మవారు

నిడదవోలు రూరల్: తిమ్మరాజుపాలెం గ్రామంలో వేంచేసి ఉన్న కోటసత్తెమ్మ అమ్మవారి తిరునాళ్ల శనివారంతో ముగిశాయి. ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు, సుమలత దంపతులు, కుమారుడు వరుణ్‌సాయి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఈఓ బళ్ల నీలకంఠం పర్యవేక్షణలో ఆలయంలో ఉదయం చండీ పారాయణం, సాయంత్రం హోమాలు, ఊయలసేవ నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పూలగరగలు ఆకట్టుకున్నాయి. ముమ్మిడివరపు బాలకోటయ్య బ్రదర్స్‌తో సన్నాయిమేళం, తాళాలు, గరగనృత్యాలు, తాడేపల్లిగూడెం వారితో కమలం పువ్వులు డ్యాన్స్‌లతో అలరించారు. అనంతరం భారీ బాణసంచా కాల్చడంతో ఆలయ పరిసరాలు వెలుగులు విరజిమ్మాయి. అమ్మవారిని దర్శించుకుని సాంస్కృతిక కార్యక్రమాలు తిలకించేందుకు పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, వైస్ చైర్మన్ గంగుల వెంకటలక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు అయినీడి పల్లారావు, జేసీఎస్ మండల కన్వీనర్ వెలగన పోలయ్య, ఆలయ ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్, చైర్మన్ దేవులపల్లి రవిశంకర్, ధర్మకర్త మండలి సభ్యులు గాజుల రంగారావు, అయినీడి వెంకటకృష్ణ, మిద్దే శ్రీను, రేలంగి మారుతి శివభాస్కర రావు, ఉర్ల వీరవెంకటలక్ష్మి, బోనేపల్లి ఉమాదేవి, వద్దిరెడ్డి మహాలక్ష్మి, నిచ్చెనకోళ్ల భవాని, సొసైటీ అధ్యక్షుడు యాళ్ల రామారావు, ఆలయ ప్రధాన అర్చకులు శివకోటి అప్పారావు శర్మ, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యుడు, కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

నీరు కలుషితం



డ్రైన్ కారణంగా నీరు రోడ్డుపైకి వస్తుందని చెబుతున్న గ్రామస్తులు

తాళ్లపూడి: గజ్జరం కొత్త కాలనీలో కుళాయి నీరు కలుషితమైందని ఆ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కాలనీలో డ్రైన్ నిర్మించారు. అదే ప్రాంతంలో పైపులైన్ ఉండడంతో పనుల కారణంగా పాడైపోయింది. డ్రైనేజీలోని మురుగునీరు పైపులైన్‌లో కలుస్తోంది. దీంతో కుళాయి నీటిలో నలకలతోపాటు దుర్గంధం వెదజల్లుతోంది. ఇదే నీరు స్కూల్‌కు కూడా పంపిణీ అవుతుందన్నారు. డ్రైన్ సక్రమంగా లేక మురుగునీరు రోడ్డుపై చేరుతోంది. దీనిపై గ్రామస్తులు ముళ్ల కృష్ణ, మాజీ ఎంపీటీసీ చిక్కాల మహేష్, మడతల శ్రీను, ఫిలిపే దుర్గారావు పంచాయతీకి వెళ్లి ఫిర్యాదు చేసామని తెలిపారు. అయినా పరిష్కారంకాలేదని ఆరోపించారు. ఈ విషయమై గ్రామ సర్పంచ్ గండి రాంబాబు మాట్లాడుతూ గతం లోనే కల్వర్ట్ ప్రతిపాదన చేశామని, పైప్‌లైన్ మరమ్మతులు పూర్తి చేశామని, పంచాయతీ కార్యదర్శి ఆ ప్రాంతాన్ని సందర్శించారని చర్యలు తీసుకుంటామని తెలిపారు.